క్లుప్తంగా

నేడు దామేగుంటలో 'వై ఏపీ నీడ్స్ జగన్'

కొడవలూరు : మండలంలోని దామేగుంటలో గురువారం మధ్యాహ్నం 3 గంటలకు 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం జరుగుతుందని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గంధం వెంకటశేషయ్య బుధవారం తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు.

రోడ్డుపై కూలిన భారీ చెట్టు



ఇందుకూరుపేట : వర్షం కారణంగా మండలంలోని ఏడో మైలు వద్ద బుధవారం రోడ్డుకు అడ్డంగా భారీ చింతచెట్టు వాలింది. దీంతో వాహన రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. స్థానికులు, పంచాయతీ సిబ్బంది చెట్టును తొలగించడంతో రాకపోకలు కొనసాగాయి.

పాపిరెడ్డిపాళెం కాలువలో పూడికతీత

తోటపల్లిగూడూరు : జాఫర్ సాహెబ్ డిస్ట్రిబ్యూటరీ కెనాల్ పరిధిలోని పాపిరెడ్డిపాళెం సాగునీటి కాలువ పూడికతీత పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఈ కాలువ పరిధిలో దాదాపు 1,500 ఎకరాల్లో వరి సాగవుతోంది. అయితే ఈ కాలువలో గడ్డి, బురద పెరిగిపోవడంతో కిందకు సాగునీరు సక్రమంగా పారక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో స్థానిక రైతుల విజ్ఞప్తి మేరకు కాలువ పూడికతీతపై పాపిరెడ్డిపాళెం సర్పంచ్ కదురు సుబ్బయ్య రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి దృష్టి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన మంత్రి కాకాణి కాలువ పూడికతీత పనులను వెంటనే చేపట్టాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. ఈ క్రమంలో గత రెండు రోజుల నుంచి అధికారులు పూడికతీత పనులు నిర్వహిస్తున్నారు. దీంతో స్థానిక రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ కాలువ పనులను స్థానిక వైఎస్సార్‌సీపీ నేతలు కదురు శివయ్య, రాధయ్య, లక్ష్మణ్, వెంకటేశ్వర్లు పర్యవేక్షిస్తున్నారు.

వేదగిరిపై పవిత్రోత్సవాలకు అంకురార్పణ

నెల్లూరు రూరల్: రూరల్ మండలం, నరసింహకొండపై కొలువైన వేదగిరి లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానంలో పవిత్రోత్సవాలకు బుధవారం సాయంత్రం అంకురార్పణ చేశారు. శ్రీవారు, ఆదిలక్ష్మి అమ్మవారికి విశేష పూజలు, హోమాలు నిర్వహించారు. ఆగమ విద్వాన్ సత్యనారాణచార్యుల బృందంతో పాటు ఆలయ ప్రధానార్చకుడు భాస్కరాచార్యులు, అర్చకులు పూజల్లో పాల్గొని పవిత్రోత్సవాల విశిష్టతను భక్తులకు వివరించారు. ఆలయ చైర్మన్ వేమిరెడ్డి సురేంద్రరెడ్డి, ఈఓ గిరికృష్ణ, పాలకమండలి సభ్యులు పాల్గొన్నారు.

తరతరాల భూ సమస్యలకు పరిష్కారం



భూ పట్టా అందజేస్తున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి



హాజరైన రైతులు

- రాష్ట్ర మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి
- అసైన్‌మెంట్ భూములకు పట్టాల పంపిణీ

ముత్తుకూరు : తరతరాలుగా పేద రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యను సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పరిష్కరించారని రాష్ట్ర వ్యవసాయ–సహకార శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి తెలిపారు. ముత్తుకూరులోని మత్స్యకళాశాలలో మండలంలోని పేద రైతులు అనుభవిస్తున్న అసైన్‌మెంట్ భూములకు మంత్రి బుధవారం పట్టాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మండలంలో 377 మంది రైతులకు సంబంధించి 288 ఎకరాల భూములకు పట్టాలు పంపిణీ చేస్తున్నామన్నారు. సర్వేపల్లి నియోజకవర్గంలో 5,023 ఎకరాల భూములకు పట్టాలు పంపిణీ చేశామన్నారు. ఒక్క నారికేళపల్లి పంచాయతీలోనే 135 కుటుంబాలకు సంబంధించి 126 ఎకరాల భూములకు పట్టాలు పంపిణీ చేయడం విశేషమన్నారు. ఒక వేళ పరిశ్రమలకు అవసరమైన భూములు సేకరిస్తే రైతులే పరిహారం పొందే స్వేచ్ఛ ఉంటుందని చెప్పారు. ఇందులో ఏపీఐఐసీ ప్రమేయం, జోక్యం ఉండదన్నారు. ఈ విధంగా అసైన్‌మెంట్ భూములను విలువైన పట్టా భూములుగా మార్చిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేద రైతులకు గొప్ప వరం ఇచ్చారని తెలియజేశారు. ప్రతిపక్ష ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు తన దృష్టికి వచ్చిన ఈ సమస్యను ఇప్పుడు మంత్రి హోదాలో సీఎంతో చర్చించి, పరిష్కరించడం సంతోషంగా ఉందన్నారు. తెల్లదొరల కాలం నాటి చుక్కల భూముల సమస్యను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పరిష్కరించిందన్నారు. అయితే, అసైన్‌మెంట్ భూములకు పట్టాలు ఇవ్వడం టీడీపీ నేత సోమిరెడ్డికి ఇష్టంలేదని ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు మెట్ట విష్ణువర్ధనరెడ్డి, ఎంపీపీ గండవరం సుగుణ, మండల ఉపాధ్యక్షుడు పోలిరెడ్డి చిన్నపరెడ్డి, తహసీల్దార్ బాలకృష్ణారెడ్డి, పార్టీ నేతలు మునుకూరు రవికుమార్‌రెడ్డి, దువ్వూరు చంద్రశేఖర్‌రెడ్డి, దువ్వూరు విశ్వమోహన్‌రెడ్డి, మునుకూరు జనార్దన రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్వల్పకాలిక వరి రకాలను వేసుకోవాలి

- ఏడీఏ సుజాత



కొడవలూరు : మాట్లాడుతున్న ఏడీఏ సుజాత

కొడవలూరు : రైతులు స్వల్పకాలిక వరి రకాలను వేసుకోవాలని కోవూరు ఏడీఏ డి.సుజాత సూచించారు. మండలంలోని రామన్నపాళెం, కమ్మపాళెంలలో నీటి యాజమాన్యంపై బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జలాశయంలో నీటి నిల్వ తక్కువగా ఉన్న నేపథ్యంలో 14 మండలాలకు మాత్రమే సాగునీటిని విడుదల చేశారని తెలిపారు. ప్రతి రైతు నీటిని పొదుపుగా వాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. 120 రోజుల పంట కాలం ఉండే ఎన్ఎల్ఆర్ 34449, ఆర్ఎన్ఆర్ 15048, కేఎన్ఎం 1638 తదితర రకాలను సాగు చేసుకోవాలన్నారు. పంట ఎల్లప్పుడూ నీటిలో ఉండేలా చేయడం వల్ల నీటి వృథా ఎక్కువగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ జి.జ్యోతి, ఇరిగేషన్ ఏఈ పి.పార్థసారథి, ఏఓ లక్ష్మి, వైఎస్సార్‌సీపీ నేత కె.శ్రీనివాసులు పాల్గొన్నారు.

సాగునీటిని పొదుపుగా వాడుకోవాలి

ముత్తుకూరు : సోమశిల జలాశయం నుంచి విడుదలైన సాగునీటిని రైతులు పొదుపుగా వాడుకోవాలని ఇందుకూరుపేట ఏడీఏ రాజ్‌కుమార్ విజ్ఞప్తి చేశారు. మండలంలోని ముసునూరువారిపాళెం రైతు భరోసా కేంద్రంలో బుధవారం జరిగిన గ్రామ సభలో ఆయన పాల్గొని, ప్రసంగించారు. సాగునీరు విడుదలైన నేపథ్యంలో రైతులు స్వల్పకాలిక రకం వరి విత్తనాల సాగుపై దృష్టి సారించాలన్నారు. మండల వ్యవసాయాధికారి జ్యోత్స్నరాణి మాట్లాడుతూ, సాగునీటి వినియోగంలో మెళకువలు పాటించాలని కోరారు. సాగునీటి వినియోగంపై ప్రత్యేక కమిటీ వేశారని చెప్పారు. అనంతరం ముత్తుకూరులోని బ్యాంకులను సందర్శించి, కౌలు రైతులు రుణాలు పొందుతున్న అంశాలను పరిశీలించారు.

నీటి యాజమాన్య పద్ధతులు పాటించాలి

తోటపల్లిగూడూరు : వరిసాగులో నీటి యాజమాన్య పద్ధతులు పాటించాల్సిన అవసరం ఉందని మండల వ్యవసాయాధికారి శిరీషారాణి సూచించారు. మండలంలోని నరుకూరు, ముంగళదొరువు, వెంకన్నపాళెం, మాచర్లవారిపాళెం, వరకవిపూడి రైతు భరోసా కేంద్రాల్లో మంగళవారం రైతులకు నీటి వినియోగంపై అవగాహన సదస్సులను నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ శిరీషారాణి మాట్లాడుతూ ప్రస్తుత రబీ సీజన్‌లో మేలైన యాజమాన్య పద్ధతులతో సాగు చేపడితే అధిక దిగుబడులు సాధించే అవకాశం ఉందన్నారు. ప్రస్తుతం సాగునీటి ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని రైతులు నీటిని పొదుపుగా వాడాలన్నారు. డిసెంబర్ 15వ తేదీలోపు రైతులు వరినాట్లు వేసుకోవాలన్నారు. పిలకదశలో 2 సెంటీమీటర్ల నీరు, పూత దశలో 5 సెం.మీ నీరు పెడితే సరిపోతుందన్నారు. ప్రతి సచివాలయం పరిధిలోని రైతు భరోసా కేంద్రాల్లో అన్నిరకాల ఎరువులను సిద్ధంగా ఉంచామని, రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

- విడవలూరు : మండలంలోని ఊటుకూరు, రామతీర్థం, రామచంద్రాపురం గ్రామాల రైతులకు ఏఓ కృష్ణయ్య బుధవారం పలు సూచనలు చేశారు. స్వల్పకాలిక వరి వంగడాలను వాడాలని సూచించారు. వ్యవసాయ విస్తరణాధికారి కిరణ్, లక్ష్మి పాల్గొన్నారు.



ముత్తుకూరు : మాట్లాడుతున్న ఏడీఏ రాజ్‌కుమార్



తోటపల్లిగూడూరు : రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు

కులగణన పక్కాగా నిర్వహించాలి



సర్వేపై శిక్షణ ఇస్తున్న హరేందర్‌రెడ్డి

మనుబోలు : ఈనెల 27 నుంచి ప్రారంభం కానున్న కులగణన పక్కాగా నిర్వహించాలని ఎంపీడీఓ ప్రసాద్ సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో కులగణనపై బుధవారం రెండో రోజు శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు మూడు రోజుల పాటు కులగణన చేపడుతున్నట్లు తెలిపారు. కులగణనకు, ప్రస్తుతం అమలవుతున్న సంక్షేమ పథకాలకు ఎటువంటి సంబంధం ఉండదన్నారు. డిజిటల్ విధానంలో సర్వే ఉంటుందని వెల్లడించారు. ప్రత్యేకంగా తయారు చేసిన యాప్‌లో 34 అంశాల ఆధారంగా వివరాలు సేకరించి నమోదు చేస్తారని తెలిపారు. సర్వే సందర్భంగా ప్రజలు తెలియజేసిన వివరాలను నమోదు చేసుకోవాలన్నారు. ఈ సర్వేలో వ్యక్తుల సామాజిక, విద్య, ఆర్థిక తదితర స్థితిగతులపై వివరాలను సేకరించి వారు ధ్రువీకరించాకే నమోదు చేస్తారని తెలిపారు. అనంతరం సర్వే ఎలా చేయాలనే విషయంపై డీఆర్‌పీ హరేందర్‌రెడ్డి శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఓ రవికుమార్‌రెడ్డి, డీఆర్పీ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మూగజీవాల అపహరణ

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: మూగజీవాలను గుర్తుతెలియని వ్యక్తులు అపహరించుకెళ్లిన ఘటన కాగులపాడులో చోటు చేసుకుంది. వివరాలు.. కాగులపాడులో ఉక్కాల రవికి చెందిన 22 గొర్రెలు, రెండు మేకలను గుర్తుతెలియని వ్యక్తులు మంగళవారం వేకువన అపహరించుకెళ్లారు. ఉదయం లేచి చూసిన బాధితుడు గ్రామం మొత్తం వెతికినా కనిపించలేదు. దీంతో బుచ్చిరెడ్డిపాళెం పోలీస్‌స్టేషన్‌లో బుధవారం ఫిర్యాదు చేశారు. జీవాల విలువ సుమారు రూ.1.50లక్షలు ఉంటుందని ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై మహేంద్ర తెలిపారు.

జైన్‌కుమారికి నివాళులు



జైన్‌కుమారి(ఫైల్)

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : ఆత్మకూరు సీడీపీఓగా పనిచేస్తున్న జి.జైన్‌కుమారి ఈనెల 16న అనారోగ్యంతో మృతిచెందిన విషయం తెలిసిందే. ఆమె పెద్దకర్మ బుధవారం బుచ్చిరెడ్డిపాళెంలోని ఎస్ఎస్ కల్యాణ మండపంలో జరిగింది. ఈ సందర్భంగా పలువురు ఆమె చిత్రపటం వద్ద నివాళి అర్పించారు. కార్యక్రమానికి హాజరైన ఐసీడీఎస్ పీడీ హేనాసుజన్ మాట్లాడుతూ స్త్రీ శిశు సంక్షేమశాఖలో జైన్‌కుమారి సేవలు మరువలేనివన్నారు. ఆమె జిల్లాలోని కోవూరు, అల్లూరు, సంగం, ఆత్మకూరు, కొడవలూరు, విడవలూరు, దగదర్తి, ఏఎస్‌పేట, అనంతసాగరం మండలాల్లో సూపర్‌వైజర్‌గా విధులు నిర్వర్తించారని గుర్తుచేశారు. పనిచేసిన అన్ని మండలాల్లో మంచిపేరు తెచ్చుకున్నారని కొనియాడారు.

భూ పట్టాల పంపిణీ

పొదలకూరు : నాలుగున్నర దశాబ్దాల క్రితం తండ్రి కాకాణి రమణారెడ్డి సమితి అధ్యక్షుని హోదాలో ఊసపల్లి గ్రామస్తులకు 172 ఎకరాల మేత పోరంబోకు భూమిని అనాధీనంగా మార్చి పేదలకు భూ పట్టాలను అందజేశారు. ఆ తర్వాత ఇప్పుడు మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి చొరవతో ఊసపల్లి గ్రామస్తులు 60 మందికి 75 ఎకరాల భూ పట్టాల పంపిణీ జరిగింది. దీంతో గ్రామంలో భూ పట్టాలు పొందిన లబ్ధిదారులు బుధవారం మంత్రి కాకాణి క్యాంపు కార్యాలయానికి చేరుని మిగిలి ఉన్న పట్టాలను ఆయన చేతులమీదుగా తీసుకుని కృతజ్ఞతలు వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మంత్రిని శాలువ కప్పి సత్కరించారు. పార్టీ నాయకులు కొత్తలూరు కోటేశ్వరరావు, మలిశెట్టి మాల్యాద్రి, కొత్తలూరు ప్రభాకర్, బొమ్మిశెట్టి హరి తదితరులు పాల్గొన్నారు.



భూ పట్టాలు పొందిన లబ్ధిదారులతో మంత్రి కాకాణి

సకాలంలో సాగునీరు

- మంత్రి కాకాణికి కృతజ్ఞతలు



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నేతలు

మనుబోలు : రైతులకు సకాలంలో సాగునీరు అందించిన మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డికి వైఎస్సార్‌సీపీ నేతలు కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు వారు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ ఏడాది వర్షాలు తక్కువగా కురవడంతో మండలంలో వరిసాగు ప్రశ్నార్థకంగా మారిందన్నారు. రైతులు కష్టాలను మంత్రి కాకాణి దృష్టికి తీసుకెళ్లగా వెంటనే స్పందించి కండలేరు లోలెవల్ స్లూయిజ్ నుంచి 2 టీఎంసీల నీటి విడుదలకు చర్యలు తీసుకున్నారని తెలిపారు. అలాగే మనుబోలు, పిడూరు బంగారమ్మ చెరువుల సరఫరా కాలువల్లో పూడిక తొలగించినట్లు వెల్లడించారు. ఇకనైనా టీడీపీ నాయకులు దుష్ప్రచారాలు మానుకోవాలని హితవు పలికారు. పార్టీ నేతలు మన్నెమాల సాయిమోహన్‌రెడ్డి, బొమ్మిరెడ్డి హరగోపాల్‌రెడ్డి, దాసరి భాస్కర్‌గౌడ్, ముంగర రవీందర్‌రెడ్డి, ఏలూరు భాస్కర్‌రెడ్డి, మహేంద్రవర్మ, కోటేశ్వరగౌడ్ పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో పలువురి చేరిక



టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి చేరిన వారితో మంత్రి కాకాణి

వెంకటాచలం : సర్వేపల్లి నియోజకవర్గంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఆ పార్టీకి గుడ్‌బై చెప్పి, వైఎస్సార్‌సీపీలో చేరుతుండటంతో టీడీపీ పూర్తిగా కనుమరుగవుతోందని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. మండలంలోని చెముడుగుంట గ్రామానికి చెందిన టీడీపీ నేత బయ్యా ప్రభాకర్ ఆధ్వర్యంలో 20 కుటుంబాలు నెల్లూరు నగరంలోని మంత్రి కాకాణి క్యాంపు కార్యాలయంలో బుధవారం వైఎస్సార్‌సీపీలో చేరారు. వీరికి మంత్రి కాకాణి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జనరంజక పాలన చూసి ప్రజలంతా మళ్లీ ఆయనకే పట్టం కట్టేందుకు సిద్ధమయ్యారని పేర్కొన్నారు. సర్వేపల్లి నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత పార్టీల ప్రమేయం లేకుండా అర్హత కలిగిన ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నట్లు వెల్లడించారు. దీంతో సర్వేపల్లి నియోజకవర్గంలో ప్రజలే కాకుండా, టీడీపీ ప్రధాన నాయకులు, కార్యకర్తలు, సానుభూతిపరులు కూడా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనకు ఆకర్షితులవుతున్నారని తెలియజేశారు. గతంలో టీడీపీకి కంచుకోటగా ఉన్న చెముడుగుంట గ్రామంలో వైఎస్సార్‌సీపీకి బ్రహ్మరథం పడుతుండటంతో చాలా సంతోషంగా ఉందన్నారు. రానున్న రోజుల్లో ప్రతి గ్రామంలో టీడీపీ కేడర్ పూర్తిగా కనుమరుగు అవుతుందని, వైఎస్సార్‌సీపీకి తిరుగులేని విజయం ఖాయమని మంత్రి కాకాణి ధీమా వ్యక్తం చేశారు.

ఆపద వేళ పరారీలో టీడీపీ నేతలు

- ఏపీఎల్‌డీఏ చైర్మన్ గొల్లపల్లి విజయ్‌కుమార్

ఇందుకూరుపేట : ప్రజలకు ఏమైనా ఆపద వస్తే టీడీపీ నేతలు పరారీలో ఉంటారని, అంతా పూర్తయ్యాక మళ్లీ ప్రజల్లోకి వచ్చి అర్థరహిత విమర్శలు చేస్తారని ఏపీఎల్‌డీఏ చైర్మన్ గొల్లపల్లి విజయ్‌కుమార్ అన్నారు. మండలంలోని పున్నూరు గ్రామంలో బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వరదల సమయంలో, కరోనా కష్టకాలంలో కూడా ప్రజలకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే అండగా నిలిచిందని గుర్తుచేశారు. టీడీపీ నేత పోలంరెడ్డి దినేష్‌రెడ్డి ప్రజలకు వాస్తవాలు చెప్పాలన్నారు. కరోనా కష్టకాలంలో ఎమ్మెల్యే ప్రసన్న తన సొంత నిధులు, దాతల సాయంతో గ్రామాలకు కూరగాయలు, పండ్లు, నిత్యావసర వస్తువులు పంపించినట్లు గుర్తుచేశారు. చంద్రబాబు, పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, టీడీపీ నాయకులు ఏమి చేశారో చెప్పాలని నిలదీశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు బీవీ రమణయ్య, ఎంపీటీసీ కరుణాకర్, పార్టీ నేతలు గొల్లపల్లి అవినాష్, ఉదయ్, కృష్ణప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గొల్లపల్లి విజయ్‌కుమార్

అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందాలి

- 'వై ఏపీ నీడ్స్ జగన్'లో ప్రజాప్రతినిధుల వెల్లడి

పొదలకూరు : అర్హులైన ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాలు అందాలని వైస్ ఎంపీపీ వేణుంబాక చంద్రశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని తోడేరు సచివాలయంలో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమంలో భాగంగా బుధవారం సంక్షేమ పథకాల అమలు బోర్డును ప్రారంభించారు. అనంతరం వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరించి, మాట్లాడారు. వలంటీర్లు, గృహసారథులు, ప్రజాప్రతినిధులు ఇంటింటికీ వెళ్లి సమస్యలను తెలుసుకోవడంతో పాటు సంక్షేమ పథకాల అమలు తీరుపై అడిగి తెలుసుకోవాలన్నారు. అర్హులై ఉండి పథకాలు అందకుంటే వెంటనే వలంటీర్ల ద్వారా సచివాలయంలో నమోదు చేయించాల్సిందిగా సూచించారు. కార్యక్రమంలో జేసీఎస్ మండల కన్వీనర్ బచ్చల సురేష్‌కుమార్‌రెడ్డి, పార్టీ మండలాధ్యక్షుడు పెదమల్లు రమణారెడ్డి, ఎంపీటీసీ సుగుణ, సర్పంచ్ ఆలుపూరు పెంచలమ్మ, సచివాలయ కన్వీనర్లు అట్ల రవీంద్ర, మన్నవరపు మురళి, మాధవి పాల్గొన్నారు.

సంక్షేమంలో ఇతర రాష్ట్రాలకు ఆదర్శం

ముత్తుకూరు : దేశంలో ఎక్కడా లేనివిధంగా మన రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలను ఇతర రాష్ట్రాలూ ఆదర్శంగా తీసుకునే పరిస్థితి ఏర్పడిందని ఎంపీపీ గండవరం సుగుణ, సచివాలయ మండల కన్వీనర్ నెల్లూరు శివప్రసాద్ అన్నారు. మండలంలోని ముసునూరువారిపాళెం సచివాలయంలో సర్పంచ్ మునుకూరు జనార్దనరెడ్డి అధ్యక్షతన బుధవారం జరిగిన 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. సచివాలయ పరిధిలో సంక్షేమ పథకాల అమలుపై ఫ్లెక్సీని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సర్కారును రాబోయే ఎన్నికల్లో ఆదరించాలని విజ్ఞప్తి చేశారు. జెడ్పీటీసీ సభ్యుడు బందెల వెంకటరమణయ్య, కార్యదర్శి హరికృష్ణ పాల్గొన్నారు.

జగనన్న పాలనలో హామీలన్నీ అమలు

వెంకటాచలం : సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రజలకిచ్చిన హామీలన్నీ అమలు చేశారని మండల ఏఏబీ చైర్మన్ కోడూరు ప్రదీప్‌కుమార్‌రెడ్డి అన్నారు. మండలంలోని అనికేపల్లి గ్రామంలో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీలోని పలు కాలనీలు తిరిగి సంక్షేమ పథకాలు, గ్రామాల అభివృద్ధి గురించి ప్రజలకు వివరించారు. అనంతరం ప్రదీప్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల హామీలను వంద శాతం అమలు చేసిన ఘనత జగనన్నకు మాత్రమే దక్కుతుందని చెప్పారు. చంద్రబాబు పాలనలో సంక్షేమం, అభివృద్ధి పూర్తిగా కుంటుపడ్డాయని విమర్శించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మందల వెంకటశేషయ్య, పార్టీ మండలాధ్యక్షుడు కొణిదెన మోహన్‌నాయుడు, పార్టీ నేత కొణిదెన విజయభాస్కర్‌నాయుడు, సర్పంచ్ కొమరిగిరి శీనమ్మ పాల్గొన్నారు.



బుచ్చిరెడ్డిపాళెం రూరల్: ఇసకపాళెంలో..

మరలా జగనే సీఎం కావాలి

తోటపల్లిగూడూరు : రాష్ట్రంలో సంక్షేమ పథకాలు కొనసాగాలంటే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరలా సీఎం కావాలని వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు ఉప్పల శంకరయ్యగౌడ్ అన్నారు. మండలంలోని సౌత్‌ఆములూరు సచివాలయ పరిధిలో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధితో పాటు సంక్షేమానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి ప్రజలు పట్టం కట్టాలని కోరారు. అనంతరం వారు ఇంటింటికీ వెళ్లి ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టారు. జేసీఎస్ మండల కన్వీనర్ తలమంచి సురేంద్రబాబు, వైస్ ఎంపీపీ చెరుకూరు శ్రీనివాసులునాయుడు, సర్పంచ్ చెరుకూరు సరళకుమారి, స్థానిక నేత కిశోర్, ఈఓపీఆర్డీ నారాయణరెడ్డి పాల్గొన్నారు.

జగనన్నతోనే సామాజిక న్యాయం సాధ్యం

విడవలూరు : మండలంలోని ఊటుకూరు గ్రామంలో మాజీ ఏఎంసీ చైర్మన్ రామిరెడ్డి విజయభానురెడ్డి ఆధ్వర్యంలో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జెండాను ఆవిష్కరించి, సంక్షేమ బోర్డును ప్రదర్శించారు. అనంతరం విజయభానురెడ్డి మాట్లాడుతూ పేద ప్రజలకు సామాజిక న్యాయం జరగాలంటే మళ్లీ సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకోవాలని కోరారు. ఎంపీడీఓ శ్రీనివాసరావు, పార్టీ నేతలు వెంకట కృష్ణారెడ్డి, సర్పంచ్ చౌరూరి వెంకట శేషమ్మ, ఎంపీటీసీ ఎ.శేషమ్మ పాల్గొన్నారు.

సమపాళ్లలో సంక్షేమం, అభివృద్ధి

కొడవలూరు : రాష్ట్రంలో సమపాళ్లలో సంక్షేమం, అభివృద్ధి జరుగుతోందని ఎంపీపీ గాలి జ్యోతి అన్నారు. మండలంలోని కమ్మపాళెంలో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సచివాలయ పరిధిలో జరిగిన రూ.15.84 కోట్ల సంక్షేమ లబ్ధిని డిజిటల్ బోర్డుపై ఆవిష్కరించి మాట్లాడారు. అట్టడుగు వర్గాలకు సంక్షేమ పథకాలు అందిస్తున్న ఏకైక ప్రభుత్వం రాష్ట్రంలో కొనసాగుతోందన్నారు. యూనియన్ బ్యాంక్ రిటైర్డ్ మేనేజర్ జి.మస్తానయ్య మాట్లాడుతూ అందరికీ మేలు జరగాలంటే జగన్‌మోహన్‌రెడ్డినే సీఎంను చేసుకుందామన్నారు. తొలుత గ్రామ కూడలిలో వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరించారు. తలమంచి సొసైటీ చైర్మన్ దేవనబోయిన శివకుమార్, ఎంపీటీసీ పి.అరుణకుమారి, సర్పంచ్ చౌటూరు లక్ష్మయ్య, పార్టీ నేతలు బి.వెంకటనగేష్ నాయుడు, టి.ప్రసన్నకుమార్, పంచాయతి కార్యదర్శి ఆర్.శివకుమార్ పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీదే అధికారం

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : పట్టణంలోని ఇసకపాళెం–1 సచివాలయం మూడు, నాలుగు వార్డుల్లో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం నిర్వహించారు. తొలుత పార్టీ నేతలు వైఎస్సార్‌సీపీ జెండాను ఎగురవేశారు. అనంతరం నగర పంచాయతీ చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ మాట్లాడారు. రాష్ట్రంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలే వైఎస్సార్‌సీపీని గెలిపిస్తాయని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ టౌన్ అధ్యక్షుడు టి.మల్లికార్జునరెడ్డి, నాయకులు మోర్ల మురళి, గృహసారథులు, వలంటీర్లు పాల్గొన్నారు.

కాగులపాడులో..

మండలంలోని కాగులపాడు గ్రామంలో వైఎస్సార్‌సీపీ రూరల్ కన్వీనర్ చెర్లో సతీష్‌రెడ్డి ఆధ్వర్యంలో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ప్రజలకు సంక్షేమ పథకాల గురించి వివరించారు. వైఎస్సార్‌సీపీ జెండాను ఎగురవేశారు. పార్టీ నేతలు బి.వినోద్‌కుమార్, ప్రదీప్ పాల్గొన్నారు.



ముత్తుకూరు : ముసునూరువారిపాళెం సచివాలయంలో..



పొదలకూరు : సంక్షేమ పథకాల బోర్డును ప్రారంభించిన వైస్ ఎంపీపీ



వెంకటాచలం : అనికేపల్లిలో సంక్షేమ పథకాలను వివరిస్తున్న పార్టీ నేతలు



విడవలూరు : ఊటుకూరులో..



కొడవలూరు : కమ్మపాళెంలో..



బుచ్చిరెడ్డిపాళెం రూరల్: కాగులపాడులో...